సాక్షి మహబూబాబాద్

శుక్రవారం । 7 । ఏప్రిల్ । 2023



సింగిల్ పట్టి @ రూ.67 వేలు

వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు గురువారం రైతులు తీసుకొచ్చిన మిర్చి రకాల్లో సింగిల్ పట్టి రకానికి అత్యధికంగా క్వింటాలుకు రూ.67 వేలు ధర పలికింది. - 8లో▸



కేఎంసీకి రీసెర్చ్ యూనిట్

వరంగల్ నగరంలోని కాకతీయ ప్రభుత్వ మెడికల్ కళాశాల (కేఎంసీ) మరో మైలురాయిని అధిగమించింది. - 8లో▸

గరిష్టం/కనిష్టం

$41.1^0/25.9^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగి ఎండతీవ్రత ఉంటుంది.



మిగులు దందా..

- పీడీఎస్ బియ్యం తక్కువ తూకం
- ప్రతి బస్తాలో 3నుంచి 5కిలోల వరకు లోటు
- ఇబ్బందులు పడుతున్న డీలర్లు
- ప్రతి నెలా భారీగా బియ్యం మిగులు
- సంబంధిత అధికారులే సూత్రధారులు



గోదాంలో పీడీఎస్ బియ్యం స్టాక్



బస్తా బియ్యం 45కిలోలే..

సాక్షి, మహబూబాబాద్: ప్రభుత్వం పేదలకు అందించే రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. తక్కువ తూకం వేస్తూ.. మిగులు దందాను సాగిస్తున్నట్లు సమాచారం. బస్తాలో 3 నుంచి 5కిలోల వరకు తక్కువ తూకం వేస్తూ డీలర్లకు సరఫరా చేస్తున్నారు. జిల్లాలో ఇలా ప్రతి నెల వందల క్వింటాళ్ల బియ్యం దందా సాగుతోందని తెలిసింది. సివిల్ సప్లయీస్ శాఖలోని పలువురు ఉద్యోగులు, అధికారులే సూత్రధారులుగా వ్యవహరిస్తున్నారని ప్రచారం.

సరఫరా ఇలా..

జిల్లా వ్యాప్తంగా 2,26,047 ఆహారభద్రత కార్డులు ఉండగా.. 6,76,864 మందికి నెలకు ఒక్కొక్కరికి ఆరుకిలోల చొప్పున 4,061టన్నులు, 15,300అంత్యోదయకార్డుదారుకు నెలకు 35కిలోల చొప్పున 530.5టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నారు. అలాగే 96 ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 51,007మంది విద్యార్థుల మధ్యాహ్న భోజనం కోసం 1,511క్వింటాళ్లు, 113 కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, బీసీ, ట్రైబల్, ఎస్సీ, మైనార్టీ, జ్యోతిరావు పూలే, ఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్, డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో చదివే 21,923మంది విద్యార్థులకు 3,320క్వింటాళ్ల బియ్యం సరఫరా చేస్తున్నారు.

పంపేటప్పుడు తక్కువ..

ముందుగా రైస్ మిల్లుల నుంచి ఎఫ్‌సీఐ, బఫర్ గోదాంలకు బియ్యం పంపుతారు. అక్కడి నుంచి మండల లేవల్ స్టాక్ పాయింట్(ఎంఎల్ఎస్)కు పంపిస్తారు. ఈ సందర్భంగా లారీతో సహా బియ్యం తూకం వేస్తారు. ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి డీలర్లకు సరఫరా చేసే సందర్భంలో మాత్రం తూకం లేకుండా బస్తాల లెక్కలతో పంపిస్తారు. కాగా ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద బస్తాకు 3నుంచి 5కిలోల మేరకు తూకం తగ్గుతుంది. ఇలా ఒక్కో బస్తాలో సగటున 3కిలోలు తక్కువగా ఉంటుంది. ఇలా జిల్లాలో వందల క్వింటాళ్ల బియ్యం దందా జరుగుతోంది.

ఇలా మిగులు..

జిల్లాలో పాఠశాలలు, కళాశాలలు మినహా అందరూ లబ్ధిదారులు రేషన్ బియ్యం తీసుకుంటే 4వేల టన్నులకు పైగా సరఫరా చేయాల్సి ఉంటుంది. అయితే పలుకారణాల వల్ల అందరూ తీసుకోవడం లేదు. దీంతో సగటున 3వేల టన్నులు సరఫరా చేస్తారు. అంటే 30వేల క్వింటాళ్లు.. ఒక్క బస్తాలో 50కిలోల బియ్యం పోస్తారు. ఇలా 60వేల బస్తాలు ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి డీలర్ పాయింట్‌కు పంపుతారు. అంటే ఒక్క బస్తాలో 3కిలోలలు తక్కువ తూకం వచ్చినా.. 1,80,000కిలోలు అంటే 18,00క్వింటాళ్లు అనగా 180టన్నుల బియ్యం మిగులు అని అర్థం అవుతుంది. సాధారణంగా బఫర్ గోదాం నుంచి వచ్చిన బియ్యం ఎంఎల్ఎస్ పాయింట్‌లో డంప్ చేసుకోవాలి. అక్కడ ఉన్న బియ్యం డీలర్లకు పెట్టాలి. కానీ జిల్లాలో కొందరు అధికారులు, ఉద్యోగులు మిగులు బియ్యం దందాలో భాగస్వామ్యులు కావడంతో బఫర్ గోదాం నుంచి నేరుగా డీలర్లకు పంపుతున్నారు. నెలాఖరు వరకు మిగులు బియ్యం గోదాంలో స్టాక్ ఉంచుతున్నారని తెలిసింది. ఇలా మిగిలిన బియ్యం గోదాం నుంచి గుట్టుచప్పుడు కాకుండా సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు మిల్లర్లతో కుమ్మక్కై వారు పంపించాల్సిన సీఎంఆర్ బియ్యం లెక్కలో ఈ మిగులు బియ్యం చూపిస్తున్నారని ప్రచారం. ఈ దందాలో నెలకు లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నట్లు సమాచారం. అయితే తక్కువ తూకంతో తీసుకెళ్లిన డీలర్లు లెక్కలు చూపించేందుకు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

గ్రానైట్ క్వారీ పనుల్లో వివాదం



క్వారీ పక్కన ఉన్న పంటపొలాల్లో పడేసిన బండరాళ్లు



గ్రానైట్ క్వారీ, పక్కనే పంటభూములు

- పంటపొలాలు, చెరువు శిఖంలో పడేస్తున్న రాళ్లు
- న్యాయం చేయాలంటూ అధికారులకు రైతుల ఫిర్యాదు

కేసముద్రం: మండలంలోని భుక్యారాంతండాజీపీ శివారు అవుసలితండాలోని ఓ గ్రానైట్ క్వారీలో నడుస్తున్న పనులు వివాదానికి దారి తీశాయి. నిబంధనలకు విరుద్ధంగా తమ పంట పొలాల్లో రాళ్లను వేస్తూ.. పంట భూములకు దగ్గరగా తవ్వకాలు జరుపుతున్నారని కోరుకొండపల్లి, అవుసలితండాకు చెందిన పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు ఇటీవల ప్రజావాణిలో మైనింగ్ అధికారులకు బాధిత రైతులు ఫిర్యాదు చేశారు. రైతుల వివరాల ప్రకారం.. కొన్నేళ్లుగా అవుసలితండా శివారులో గ్రానైట్ క్వారీ నడుస్తోంది. ఆ క్వారీ చుట్టు పక్కల ఉన్న వ్యవసాయ భూముల్లో రైతులు వరి, మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్నారు. అయితే క్వారీ నుంచి తీసిన పెద్ద బండరాళ్లను ఆ పంట భూముల్లో, పక్కనే ఉన్న కోరుకొండపల్లి గ్రామ చెరువు శిఖంలో పడేస్తున్నారు. ఇదిలా ఉండగా తమ భూములను క్వారీకి లీజు ఇవ్వనప్పటికీ, లీజుకు ఇచ్చినట్లుగా నమోదు చేశారని ఆరోపిస్తూ రైతులు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని బేతు రమేష్, గుగులోతు సూరయ్య, శ్రీను, రవి, ఈర్యా, రామస్వామితో పాటు పలువురు రైతులు కోరుతున్నారు. అలాగే క్వారీ నుంచి వెలువడే రసాయనాలు పక్కనే ఉన్న కోరుకొండపల్లి గ్రామ చెరువులో కలుస్తున్నాయని, పైగా బండరాళ్లు, మట్టిని చెరువులో పోస్తున్నారంటూ ఇప్పటికే సర్పంచ్ జ్యోతి రెవెన్యూ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.



న్యాయం చేయాలని కోరుతున్న బాధిత రైతులు

ఫిర్యాదులపై విచారణ చేస్తున్నాం..

అవుసలితండా శివారులోని క్వారీలో నిబంధనలకు విరుద్ధంగా పనులు జరుగుతున్నాయంటూ అక్కడి రైతులు ఫిర్యాదులు చేసిన మాట నిజమే. ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఇప్పటికే మైనింగ్, రెవెన్యూ అధికారులు విచారణ మొదలుపెట్టారు. ఇంకా పూర్తిస్థాయిలో విచారణ చేయాల్సి ఉంది.

-ఫరీద్, తహసీల్దార్

న్యూస్‌రీల్

మొబైల్ ఫోన్లకు అనుమతిలేదు



కురవి: పదో తరగతి పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు తీసుకెళ్లొద్దని, ఎవరికి అనుమతి లేదని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఏకలవ్య గిరిజన మోడల్ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న పదో తరగతి పరీక్షలను ఆయన పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... గేట్ వద్ద విధుల్లో ఉండే అధికారులు లోనికి వెళ్లే ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఎస్పీ వెంట ఇన్‌చార్జ్ డీఎస్పీ రమణబాబు, సీఐ రమేష్, ఎస్సై రాము తదితరులు ఉన్నారు.

నేడు ‘గుడ్ ఫ్రైడే’



మహబూబాబాద్ రూరల్: జిల్లా వ్యాప్తంగా గుడ్ ఫ్రైడే వేడుకలకు చర్చిలు ముస్తాబయ్యాయి. క్రైస్తవులు నేడు(శుక్రవారం) వేడుకలు నిర్వహించుకోనున్నారు. జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ చర్చి, ఎల్షద్దాయ్ తదితర చర్చిల్లో క్రైస్తవులు ఆరాధనలు, ప్రార్థనలు చేసేందుందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. సాయంత్రం వరకు కార్యక్రమాలు జరుగుతాయని చర్చిల కమిటీల బాధ్యులు తెలిపారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

మహబూబాబాద్ అర్బన్: మానుకోట పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 9వ తేదీన ఉదయం 9గంటలకు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి బాస నాగమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 16 సంవత్సరాల నుంచి 20ఏళ్ల లోపు బాలబాలికలకు ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన 12మంది విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కాగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు, ఫిజికల్ డైరెక్టర్లు తమ విద్యార్థులను ఎంపిక పోటీలకు తీసుకురావాలన్నారు. విద్యార్థులు తమ జనన ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9052670288 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

పంచాయతీ కార్యదర్శులపై విచారణ



కొత్తగూడ: యువతులతో అసభ్యంగా ప్రవర్తించిన పంచాయతీ కార్యదర్శులపై కలెక్టర్ శశాంక ఆదేశాల మేరకు ఎంపీఈఓ సత్యనారాయణ గురువారం విచారణ చేపట్టారు. కార్యదర్శుల పనితీరు, వ్యవహార శైలిపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తుల తెలిపిన వివరాల నివేదికను కలెక్టర్‌కు పంపిస్తామని ఎంపీడీఓ భారతి తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంగ్లిష్ పరీక్ష

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో పదో తరగతి ఇంగ్లిష్ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని డీఈఓ పి.రామారావు గురువారం తెలిపారు. జిల్లాలో రెగ్యులర్ విద్యార్థులు 8,437మందికి గానూ 8,422 మంది హాజరై 15 మంది గైర్హాజరయ్యారన్నారు. 42మంది ప్రైవేట్ విద్యార్థులకు గానూ 38మంది హాజరై నలుగురు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. జిల్లాలోని కొత్తగూడ పరీక్ష సెంటర్‌ను కలెక్టర్ శశాంక, కురవి పరీక్ష సెంటర్‌ను ఎస్పీ శరత్‌చంద్రపవార్ సందర్శించి పరిశీలించినట్లు తెలిపారు. 50 సెంటర్లలో 50మంది సూపర్‌వైజర్లు, 50 మంది సిట్టింగ్ స్క్వాడ్స్, 100మంది ఎస్టీఓలను నియమిస్తున్నామన్నారు. జిల్లాలో ఎక్కడ ఎలాంటి అవాంతరాలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

బీజేపీపై సీఎం కేసీఆర్ కుట్ర



సమావేశంలో మాట్లాడుతున్న మదన్‌లాల్

మహబూబాబాద్ అర్బన్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ, ఎమ్మెల్సీ కవిత లిక్కర్ స్కామ్‌లను కప్పిపుచ్చుకునేందుకే సీఎం కేసీఆర్ బీజేపీపై కుట్ర చేసి హైడ్రామా ఆడుతున్నారని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మదన్‌లాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సిరికొండ సంపత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మదన్‌లాల్ మాట్లాడారు. పదో తరగతి పరీక్ష పత్రాల లీకేజీ పేరిట బండి సంజయ్‌ని అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 30లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతుందని, ప్రధాని నరేంద్రమోదీని విమర్శించే హక్కు సీఎం కేసీఆర్, రాష్ట్ర ఎమ్మెల్యేలు, మంత్రులు, బీఆర్ఎస్ నాయకులకు లేదన్నారు. రాష్ట్ర ప్రజలు, నిరుద్యోగులు, ఉద్యోగులు బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. బండి సంజయ్ కోసం తమ ప్రాణాలను సైతం లెక్క చేయమని, పోరాటం చేసి నిర్దోషిగా విడుదల చేసుకుంటామన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు రాంచందర్‌రావు మాట్లాడుతూ.. బీజేపీ, బండి సంజయ్ అంటే రాష్ట్ర ప్రభుత్వానికి భయం మొదలైందన్నారు. పేపర్ లీకేజీతో బండి సంజయ్‌కి ఎలాంటి సంబంధం లేదన్నారు. బేషరతుగా ఆయనను విడుదల చేయాలన్నారు. ముందుగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. సమావేశంలో మహిళా అధ్యక్షురాలు ఇందుభారతి, ఓర్సు పద్మ, యువజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రేంరాయుడు, అధికార ప్రతినిధి భాస్కర్‌నాయక్, పట్టణ ఉపాధ్యక్షుడు యశ్వంత్, నాయకులు సురేందర్, శివసాయి, ముస్తాఫా, శ్రీను పాల్గొన్నారు.

15మంది విద్యార్థులకు కరోనా



విద్యార్థిని ఇంటికి తీసుకెళ్తున్న తండ్రి

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో 15మంది విద్యార్థులకు కరోనా పాజిటివ్ వచ్చింది. వారికి దగ్గు, జ్వరం, జలుబు, ఉండడంతో వైద్యం అందిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. వారం క్రితం గిరిజన గురుకుల పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థికి కరోనా పాజిటివ్ రావడంతో ఐసోలేషన్‌లో ఉంచారు. ఈ క్రమంలో గురువారం మరో 15మంది విద్యార్థులకు పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఐదో తరగతిలో ముగ్గురికి, ఆరో తరగతిలో ఒకరికి, ఏడో తరగతిలో ఇద్దరికి, 8వ తరగతిలో ఆరుగురికి, 9వ తరగతిలో ముగ్గురికి కరోనా పాజిటివ్‌గా నమోదైంది. వీరికి చికిత్స అందిస్తున్నారు. కాగా మరో 15మందికి లక్షణాలు ఉన్నట్లు గుర్తించి వారిని ఐసోలేషన్ ఉంచి చికిత్స అందిస్తున్నారు. కాగా ముందస్తు జాగ్రత్తలో భాగంగా 66 మంది పదో తరగతి విద్యార్థులను రెడ్యాల గురుకుల కళాశాలకు తరలించారు. వారు అక్కడి నుంచే పరీక్షలకు హాజరవుతున్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళన చెందవద్దని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాలలో జాగ్రత్తలు పాటిస్తూ విద్యార్థులకు వైద్యం అందిస్తున్నామన్నారు. కాగా గురుకులంలో కరోనా రావడంతో తల్లిదండ్రులు భయంతో తమ పిల్లను ఇంటికి తీసుకెళ్తున్నారు.

తల్లిదండ్రులు ఆందోళన చెందొద్దు

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాలలో 15మంది విద్యార్థులకు కరోనా పాజిటివ్‌గా నమోదు కావడంపై మంత్రి సత్యవతిరాథోడ్ గురువారం స్పందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దన్నారు. కలెక్టర్ శశాంక, డీఎంహెచ్‌ఓ హరీశ్‌రాజ్‌తో పాటు సంబంధిత అధికారులకు మంత్రి ఫోన్ చేసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఐసోలేషన్‌లో ఉన్న విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. విద్యార్థులకు సమయానికి ఫుడ్, మెడిసిన్ అందేలా వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

పేరుకే 24 గంటల వైద్యసేవలు

- సమయపాలన పాటించని వైద్యాధికారులు, సిబ్బంది



వైద్యులు, సిబ్బంది కోసం ఎదురు చూస్తున్న రోగులు

దంతాలపల్లి: మండల కేంద్రంలోని ప్రజావైద్యశాలలో వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో ఆస్పత్రులను అభివృద్ధి చేస్తూ 24 గంటల వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చి, అందుకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే దంతాలపల్లి ఆస్పత్రిలో మాత్రం 24 గంటల వైద్యసేవలు అందడం లేదు. నర్సింహులపేట, దంతాలపల్లి ఉమ్మడి మండలాలకు ఒక్కటే ఆస్పత్రి కావడంతో అధిక సంఖ్యలో రోగులు వస్తారు. గురువారం నర్సింహులపేట మండలం పెద్దనాగారం, వంతడపల, పడిమటిగూడెం గ్రామాలనుంచి గర్భిణులు, షుగర్ పేషంట్లు, కోతి కరిచిందని మరొకరు వచ్చారు. కానీ, ఉదయం 9 గంటలు దాటిన కనీసం డ్యూటీ నర్సులు లేకపోవడంతో ఆస్పత్రి ఎదుటే నిరీక్షించారు. ఆస్పత్రికి ఇద్దరు మహిళా డాక్టర్లను నియమించినప్పటికీ 9:30 నిమిషాలకు ఒక వైద్యురాలు విధులకు హాజరై రోగులకు పరీక్షలు నిర్వహించారు. కాగా మధ్యాహ్నం 1:30 వరకు ఏ ఒక్క నర్సు విధుల్లో రాలేదు. దీంతో ఆస్పత్రికి వచ్చిన రోగులకు మందులు అందజేసే దిక్కులేకుండాపోయింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రిలో అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించేలా చూడాలని కోరుతున్నారు.

పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో చెప్పండి?

- సమీక్ష సమావేశంలో అధికారిపై కలెక్టర్ శశాంక ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

కొత్తగూడ: కొత్తగూడ, గంగారం మండలాల్లో ఆర్ అండ్‌బీ శాఖ ద్వారా మంజూరైన రోడ్ల పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో సమీక్ష సమావేశం ముగిసే వరకు చెప్పాలని కలెక్టర్ శశాంక ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు మండలాల్లో రోడ్ల నిర్మాణ పనుల్లో జాప్యంపై కొత్తగూడ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పాకాల నుంచి కొత్తగూడ, కొత్తగూడ నుంచి దుబ్బగూడెం, భూపతిపేట నుంచి కొత్తగూడ, కొత్తగూడ నుంచి గంగారం వరకు నిధులు కేటాయించి టెండర్లు నిర్వహించినా పనులు ఎందుకు జరగడం లేదని ఆర్‌అండ్‌బీ ఈఈ తానేశ్వర్‌ను ప్రశ్నించారు. అందుకు ఆయన పొంతన లేని సమాధానం చెప్పడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి కాంట్రాక్టర్ ఎందుకు రాలేదని, మీరు రప్పించకపోతే నేరుగా కలెక్టర్ పేషీ నుంచి పిలిచి మాట్లాడుతామన్నారు. సమావేశం ముగిసే సమయాని పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో చెప్పాలని, పనులకు కావాల్సిన అనుమతుల విషయం తామే స్వయంగా చూస్తామన్నారు. అనంతరం పంచాయతీ రాజ్‌శాఖ ఆధ్వర్యంలో నిర్మాణ దశలో ఉన్న రోడ్లపై సమీక్షించారు. అటవీశాఖ నుంచి కావాల్సిన అనుమతులు డీఎల్‌సీ ద్వారా ఇప్పిస్తామన్నారు. జూన్ నెల ప్రారంభానికి ముందే పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనసాగించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అంబరీషను ఆదేశించారు. కరోనా, టీబీ వ్యాప్తిని నిరోధించడంతో పాటు ఆరోగ్య మహిళ కార్యక్రమంపై సమీక్షించారు. అలాగే గిరిజన సంక్షేమశాఖ ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఏజెన్సీ గ్రామాల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సహకరించాలని ములుగు ఎమ్మెల్యే సీతక్క కోరారు. నిధులు మంజూరైన పనుల నిర్వహణలో వస్తున్న సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో ఐటీడీఏ పీఓ అంకిత్, డీఎఫ్‌ఓ రవికిరణ్, ఆర్డీఓ కొమురయ్య, ఐటీడీఏ ఈఈ హేమలత, వివిధ శాఖల జిల్లా, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ శశాంక సూచించారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ క్రీడా పాఠశాలలోని పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. పరీక్ష గదులు, పరీక్ష రాస్తున్న విద్యార్థులను తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

చర్యలు తీసుకోవాలి

మహబూబాబాద్: సివిల్ రైట్స్ డే నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శశాంక బిజినెస్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీని ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతినెల చివరి రోజు తప్పని సరిగా సివిల్ రైట్స్ డే నిర్వహించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై అవగాహనపర్చాలని, కమిటీ ఆదిశగా కృషి చేయాలన్నారు. జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమాధికారి సన్యాసయ్య, కమిటీ సభ్యులు కిషన్‌నాయక్, సుధాకర్, సంజీవ ఉన్నారు.

వైద్యుల పనితీరుపై అసంతృప్తి

ఏటూరునాగారం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది పనితీరు బాగాలేదని, అనుకున్న లక్ష్యాలను చేరుకోవడం లేదని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో గురువారం వైద్యాధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని మారుమూల గ్రామాల్లో డెలవరీ అయ్యే గర్భిణుల వివరాలను పూర్తి స్థాయిలో తెలుసుకొని ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు జరిగేలా ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు చూడాలన్నారు. మార్చిలో మాతా, శిశు సంరక్షణ ప్రోగ్రాంలో పీహెచ్‌సీలకు డెలవరీల టార్గెట్, రక్తహీనత కేసులను నివారించడం, ఏఎంసీ నమోదు కార్యక్రమాలను లక్ష్యాలకు ఎందుకు పూర్తి చేయలేదని కన్నాయిగూడెం, వెంకటాపురం(కె), మంగపేట, రొయ్యూర్, గోవిందరావుపేట పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బందిని ప్రశ్నించారు. ఏప్రిల్ నెలలో ఉన్న టార్గెట్ అయినా పూర్తి చేయాలని హెచ్చరించారు. ములుగు డీఎంహెచ్‌ఓ అప్పయ్య, ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశ్వర్‌రావు, వైద్యులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు తరలించాలి

- సీఎస్ శాంతికుమారి

మహబూబాబాద్: హైదరాబాద్‌లో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ 125అడుగుల విగ్రహాన్ని ఈ నెల 14న ఆవిష్కరిస్తున్నామని, ప్రతి నియోజకవర్గం నుంచి 300 మందిని తరలించాలని సీఎస్ శాంతికుమారి జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి గొర్రెల పంపిణీ, అంబేడ్కర్ జయంతి వేడుకల నిర్వహణపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో అంబేడ్కర్ విగ్రహావిష్కరణతో పాటు పలు కార్యక్రమాలు చేపడుతామన్నారు. కాగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 300మంది హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు హైదరాబాద్‌కు చేరుకునే విధంగా జిల్లా స్థాయిలో ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం సీఎం కేసీఆర్ త్వరలోనే ప్రారంభిస్తారని, దానికి అనుగుణంగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ శశాంక అధికారులతో మాట్లాడారు. ప్రతి నియోజకవర్గం నుంచి స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ప్రజల తరలింపు కోసం ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి మండల కేంద్రంలో ఉదయం ఆరు గంటల వరకు బస్సు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా పశుసంవర్థక శాఖాధికారి సుధాకర్, జెడ్పీ సీఈఓ రమాదేవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మిరపనూనె పరిశ్రమను అంగీకరించం



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ అంజయ్య

డోర్నకల్: తమ గ్రామంలో మిరపనూనె తయారీ పరిశ్రమ ఏర్పాటును అంగీకరించబోమని తొడేళ్ల గూడెం గ్రామస్తులు తేల్చి చెప్పారు. మండలంలోని తొడేళ్లగూడెం గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామసభలో గ్రామ సమీపంలో ఏర్పాటు చేస్తున్న మిరపనూనె తయారీ పరిశ్రమ ఏర్పాటుపై అభిప్రాయ సేకరణ జరిపారు. గ్రామ సమీపంలో పరిశ్రమ ఏర్పాటు చేస్తే అనేక అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని గ్రామస్తులు తెలిపారు. పరిశ్రమ ఏర్పాటును అడ్డుకుంటే పోలీసులు కేసులు పెడతామంటూ బెదిరిస్తున్నారని గ్రామస్తులు రోపించారు. పరిశ్రమ ఏర్పాటు చేసే స్థలంలో గుట్టలను పగలగొట్టేందుకు ఇష్టారాజ్యంగా బ్లాస్టింగులు జరిపినా అధికారులు పట్టించుకోలేదన్నారు. గ్రామ సర్పంచ్ పగడాల వెంకన్న మాట్లాడుతూ.. పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకించేవారంతా ఐక్యంగా ఉండాలని కోరారు. పరిశ్రమ ఏర్పాటు గురించి తనను ఎవరూ సంప్రదించలేదని, తాను డబ్బు తీసుకున్నట్లు కొంతమంది దుష్ప్రచారం చేశారని అన్నారు. పరిశ్రమ ఏర్పాటుపై గ్రామస్తులు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా తాను కలిసి పోరాడుతానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ మున్వర్‌బేగ్, ఎంపీటీసీ సభ్యురాలు ఎలమద్ది లక్ష్మి, కోఆప్షన్ సభ్యులు లాల్‌మియా, పంచాయతీ కార్యదర్శి సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

మహబూబాబాద్ అర్బన్: వేసవిని దృష్టిలో ఉంచుకొని పట్టణాలు, గ్రామాల్లో తాగునీటి సరఫరాలో అతరాయం కలుగకుండా జిల్లా కార్యనిర్వాహక ఇంజనీరింగ్, మిషన్ భగీరథ (ఇంట్రా) జిల్లా కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని మిషన్ భగీరథ జిల్లా అధికారి సురేందర్ గురువారం తెలిపారు. సురక్షిత తాగునీటి సరఫరా కోసం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటలకు కంట్రోల రూం 850312016 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పదంగా యువకుడి మృతి



ఘటనా స్థలిలో ప్రసన్నకుమార్‌ మృతదేహం

వర్ధన్నపేట: మండలంలోని నల్లబెల్లి శివారులో చెట్టుకు బైక్‌ ఢీకొని అనుమానాస్పదంగా ఓ యువకుడు మృతి చెందాడు. వర్ధన్నపేట ఏసీపీ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌లోని పుప్పాలగుట్టకు చెందిన అప్పికట్ల ప్రసన్నకుమార్‌(28) జిమ్‌ కోచ్‌గా జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి అతడు నల్లబెల్లి శివారులో తన బైక్‌తో చెట్టుకు ఢీ కొనగా పక్కనే ఉన్న కల్వర్టులో పడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆస్తి అమ్మకం విషయంలో జరిగిన తగాదాలతోనే ప్రసన్నకుమార్‌ను మార్టిన్‌ లూథర్‌, సర్వే వెంకన్న, బస్వ రాజ్‌కుమార్‌, హెర్నార్డ్‌, శిరీష, జిమ్‌ ప్రవీణ్‌ హత్య చేసి కల్వర్టులో పడేశారని మృతుడి అక్క ప్రభావతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆస్తి తగాదాలకు సంబంధించి గతంలో మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో కేసు నడుస్తోందని, ఈ విషయమై సీపీని కలిసినట్లు మృతుడి అక్క తెలిపింది. కాగా.. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించేందుకు వరంగల్‌ ఎంజీఎంకు తరలిస్తుండగా.. వరంగల్‌–ఖమ్మం రహదారిపై వాహనాన్ని ఆపి మృతుడి బంధువులు ధర్నా చేశారు. వర్ధన్నపేట ఎస్సైలు రామారావు, మంగ మృతుడి బంధువులకు సర్దిచెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

కొట్టుకొచ్చిన మృతదేహం

- మృతుడు హనుమకొండ వాసిగా గుర్తింపు

కేసముద్రం: హనుమకొండలోని సురేంద్రపురి కాలనీకి చెందిన కొంగ్ర సురేశ్‌(44) మృతదేహం మహబూబాబాద్‌ జిల్లా కేసముద్రం మండలం భుక్యారాం తండా సమీపంలోని ఎస్సారెస్పీ కాలువలో గురువారం కొట్టుకొచ్చింది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. సురేంద్రపురి కాలనీకి చెందిన సురేశ్‌ బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఆతర్వాత కనిపించకుండా పోవడంతో బంధువులు కేయూ పోలీస్‌స్టేషన్‌లో సురేశ్‌ అదృశ్యమైనట్లుగా కేసు నమోదు చేశారు. ఈక్రమంలో ఎస్సారెస్పీ కాలువలో కొట్టుకొచ్చిన మృతదేహం భుక్యారాం తండా సమీపంలోని డీబీఎం 48 ఎస్సారెస్పీ కాలువలో వంతెన పిల్లర్‌కు తట్టుకుని ఆగింది. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించారు. కాగా.. తమకు అందిన సమాచారం మేరకు మృతుడు హనుమకొండలోని సురేంద్రపురి కాలనీకి చెందిన సురేశ్‌ అనే వ్యక్తిగా గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని కేయూ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించనున్నట్లు ఆయన తెలిపారు. కాగా.. సురేశ్‌ చింతగట్టు వద్ద ఎస్సారెస్పీ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోందని ఎస్సై తెలిపారు.

కేఎంసీకి రీసెర్చ్‌ యూనిట్‌

- అనుమతిస్తూ రూ.1.25 కోట్లు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం
- మరో మైలురాయికి చేరుకున్న మెడికల్‌ కళాశాల
- ఏడాదిన్నరగా చేసిన కృషికి ఫలితం దక్కింది : ప్రిన్సిపాల్‌ మోహన్‌దాస్‌
- ఇటీవల రీజినల్‌ శిక్షణ కేంద్రానికి అనుమతి, సూపర్‌ స్పెషాలిటీ సీట్ల కేటాయింపు



ఎంజీఎం: వరంగల్‌ నగరంలోని కాకతీయ ప్రభుత్వ మెడికల్‌ కళాశాల (కేఎంసీ) మరో మైలురాయిని అధిగమించింది. 15 రోజుల క్రితం రీజినల్‌ శిక్షణ కేంద్రం ప్రారంభానికి అనుమతులు రాగా, వారం రోజుల క్రితం సూపర్‌ స్పెషాలిటీ సీట్లు సాధించుకుంది. ఈ క్రమంలోనే తాజాగా రీసెర్చ్‌ యూనిట్‌ ప్రారంభానికి కేంద్రం నుంచి అనుమతులు వచ్చాయి. పదిహేను రోజుల వ్యవధిలో మూడు ప్రత్యేకతలను సాధించుకోవడంతో కేఎంసీ అధికారులు, సిబ్బందిలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కాకతీయ మెడికల్‌ కాలేజీకి 2007లో రీసెర్చ్‌ యూనిట్‌ మంజూరు చేయాలని అప్పటి ప్రిన్సిపాల్‌ కేంద్ర ప్రభుత్వానికి విన్నవించారు. ఆ తరువాత విషయం మరుగునపడింది. ఏడాదిన్నర కాలం నుంచి కేఎంసీ ప్రిన్సిపాల్‌ మోహన్‌దాస్‌ రీసెర్చ్‌ యూనిట్‌ మంజూరు కోసం చేసిన విన్నపం ఎట్టకేలకు ఫలించింది. కేంద్రప్రభుత్వం రూ.1.25 కోట్ల నిధులు మంజూరు చేస్తూ రీసెర్చ్‌ సెంటర్‌ నెలకొల్పడానికి అనుమతినిస్తూ గురువారం కాలేజీకి ఉత్తర్వులు అందజేసింది. ఢిల్లీలోని ఐసీఎంఆర్‌ పథకంలో భాగంగా కేంద్రం ప్రభుత్వం ఈ రీసెర్చ్‌ యూనిట్‌లను దేశవ్యాప్తంగా ఐదు మంజూరు చేయగా అందులో ఒకటి సిద్దిపేట మెడికల్‌ కళాశాలకు, మరోటి కేఎంసీకి దక్కింది.

15 రోజుల వ్యవధిలో రెండు ప్రత్యేక అనుమతులు

కాకతీయ మెడికల్‌ కళాశాలలో నెల్స్‌ (నేషనల్‌ ఎమర్జెన్సీ లైఫ్‌ సపోర్టు) పథకంలో భాగంగా నెలరోజుల్లో రీజినల్‌ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించడానికి పూర్తిస్థాయి అనుమతులు లభించి 15 రోజులు గడవకముందే రీసెర్చ్‌ సెంటర్‌ మంజూరుపై వైద్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నెల్స్‌ శిక్షణ కేంద్రం ప్రస్తుతం ఒక్క ఉస్మానియా మెడికల్‌ కళాశాలలో కొనసాగుతుంది. ఈనేపథ్యంలో ఇలాంటి శిక్షణ కేంద్రాన్ని వరంగల్‌లోనే ప్రారంభించాలని సంకల్పించి రూ.1.50 కోట్ల పరికరాలను ప్రభుత్వం కొనుగోలు చేసి కేఎంసీకి చేర్చింది. అంతేకాకుండా ఎమర్జెన్సీ సమయంలో ప్రాణాలు కాపాడేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశంపై వైద్యసిబ్బంది, వైద్యులకు అందించే ఈ శిక్షణ కార్యక్రమాలపై 16మంది ప్రొఫెసర్‌ స్థాయి వైద్యులకు తర్ఫీదు ఇచ్చారు. ఈ శిక్షణ కేంద్రం అందుబాటులోకి వస్తే ఆకస్మికంగా కుప్పకూలే వారిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ శిక్షణ పొందే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా వైద్యులు జరిపే పరిశోధలకు పూర్తిస్థాయిలో సహకరించే విధంగా రీసెర్చ్‌ కేంద్రాన్ని సైతం కేఎంసీకి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసి వైద్యవిద్యార్థుల విద్యబోధనలో కొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టింది. కాగా, వారం రోజులక్రితం ఐదు సూపర్‌స్పెషాలిటీ సీట్లు, ఐదు ఎమర్జెన్సీ మెడిసిన్‌ సీట్లు సాధించకోవడం మరో ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.

ఏడాదిన్నర కృషికి ఫలితం



ఏడాదిన్నర కృషి ఫలితంగా కేఎంసీకి రీసెర్చ్‌ సెంటర్‌ మంజూరైంది. ఇక్కడ రీసెర్చ్‌ యూనిట్‌ ఏర్పాటుకు 2007లో ఐసీఎంఆర్‌కు అప్పటి ప్రిన్సిపాల్‌ దరఖాస్తు చేశారు. కొన్ని కారణాల వల్ల దానిని తిరస్కరించారు. 2021 జూన్‌ నెలలో కేఎంసీ బోధన సిబ్బందితో సైంటిఫిక్‌ కమిటీ ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వం అడిగిన అన్ని రకాల నివేదికలను సమర్పించాం. వాటిని పరిశీలించిన కేంద్రం రూ.1.25 కోట్లు మంజూరు చేసింది. ఇందులో రూ.కోటితో రీసెర్చ్‌ యూనిట్‌ సంబంధించిన పరికరాలు, రూ.25 లక్షలతో సివి ల్‌ పనులు చేసుకోవడానికి అనుమతినిచ్చింది. ఈ రీసెర్చ్‌ యూనిట్‌ ఏర్పాటుతో కేఎంసీ, ఎంజీఎంలోని వైద్యులు, వైద్యసిబ్బందికి వివిధ కోర్సుల్లో పరిశోధనలు చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది.

– మోహన్‌దాస్‌, కేఎంసీ ప్రిన్సిపాల్‌

‘ఎస్సై’ రాత పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- వరంగల్‌ పోలీస్‌ కమిషనర్‌ ఏవీ.రంగనాథ్‌



వరంగల్‌ క్రైం: ఈనెల 8,9 తేదీల్లో పోలీస్‌ శాఖలోని వివిధ విభాగాల్లో స్టైఫండరీ క్యాడెట్‌ ట్రైనీ ఎస్సై (సివిల్‌/ఏఆర్‌/టీఎస్‌ఎస్పీ/ఎస్పీఎఫ్‌/ఎస్‌ఏఆర్‌ సిపియల్‌/ఫైర్‌) అభ్యర్థులకు జరగనున్న రాత పరీక్షకు ఏర్పాట్లు పూర్తయ్యాయని, రాత పరీక్ష సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వరంగల్‌ పోలీస్‌ కమిషనర్‌ ఏవీ.రంగనాథ్‌ తెలిపారు. ఎస్సై అభ్యర్థుల రాత పరీక్ష కోసం వరంగల్‌, హనుమకొండ ప్రాంతాల్లో మొత్తం 21 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. రెండ్రోజులపాటు నిర్వహించనున్న ఈరాత పరీక్షల్లో నాలుగు పేపర్లు రాత పరీక్షను నిర్వహిస్తామని, ఈ రాత పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ పరీక్షకు 14,380 మంది అభ్యర్థులు హాజరవుతుండగా.. ఇందులో 3,315 మంది మహిళా అభ్యర్థులు ఉన్నట్లు తెలిపారు.

అభ్యర్థులకు ముఖ్య సూచనలు..

- అభ్యర్థి ఒక నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు.
- అభ్యర్థి వెంట హాల్‌టికెట్‌ తెచ్చుకోవాలి.
- ఎలక్ట్రానిక్‌ వస్తువులు తీసుకురావొద్దు.
- ఓఎంఆర్‌ షీట్‌పై అనవసర సమాచారం, గుర్తులు, మత పరమైన చిహ్నాలు రాయకూడదు.
- అభ్యర్థులు మెహందీ, సిరా మొదలగునవి వారివారి చేతులపై గాని పాదాలపై గానీ రాసుకుని రాకూడదు.

ఆలిండియా పోటీలకు సాఫ్ట్‌బాల్‌ జట్టు



జట్టుతో కేయూ స్పోర్ట్స్‌ బోర్డ్‌ సెక్రటరీ డాక్టర్‌ సవితాజ్యోత్స్న

కేయూ క్యాంపస్‌: పంజాబ్‌ యూనివర్సిటీలో ఈనెల 5న ప్రారంభమై 9వ తేదీ వరకు జరిగే ఆలిండియా ఇంటర్‌ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్‌ పోటీలకు కాకతీయ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్‌ పురుషుల జట్టును ఎంపిక చేసి పంపినట్లు స్పోర్ట్స్‌ బోర్డ్‌ సెక్రటరీ డాక్టర్‌ సవితాజ్యోత్స్న గురువారం తెలిపారు. జట్టులో ఆర్‌.గంగరాజు, పి.మనోహర్‌, బి.నవీన్‌ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహబూబాబాద్‌), బి.సర్దార్‌, ఎం.అజయ్‌ (యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్‌ సైన్స్‌ కళాశాల, హనుమకొండ), జి.అన్వేశ్‌, బి.రాజశేఖర్‌, వి.అజిత్‌కుమార్‌ (యూసీపీఈ కేయూ), ఎన్‌.తరుణ్‌ (కిట్స్‌ వరంగల్‌), బి.ప్రవీణ్‌ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రంగశాయిపేట), బి.భరత్‌, ఎం.విక్రమ్‌, ఎస్‌.సంతోశ్‌ (వీసీపీఈ బొల్లికుంట), ఎల్‌.కళ్యాణ్‌ (యూపీపీఈ కేయూ, ఖమ్మం), జి.చరణ్‌తేజ, కె.రాజశేఖర్‌ (ఎస్‌వీఎస్‌ డిగ్రీ అండ్‌ పీజీ కళాశాల, హనుమకొండ) ఉన్నారు. జట్టుకు కోచ్‌ కమ్‌ మేనేజర్‌గా హనుమకొండ జిల్లా భీమారం ఎస్‌వీఎస్‌ గ్రూప్‌ ఆఫ్‌ ఇన్‌స్టిట్యూషన్స్‌ ఫిజికల్‌ డైరెక్టర్‌ ఎ.రవికుమార్‌ వ్యవహరిస్తున్నారు.

18న రామప్పలో ప్రపంచ వారసత్వ ఉత్సవాలు



కలెక్టర్‌తో రోషన్‌ స్వాయ్‌

ములుగు: ఈనెల 18న ప్రపంచ గుర్తింపు పొందిన ప్రఖ్యాత రామప్ప దేవాలయంలో ప్రపంచ వారసత్వ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఇండియన్‌ ఆయిల్‌ కార్పొరేషన్‌ వరంగల్‌ మేనేజర్‌, డివిజనల్‌ రిటైల్‌ సేల్స్‌ హెడ్‌ రోషన్‌ స్వాయ్‌ అన్నారు. ఈసందర్భంగా జిల్లా కేంద్రంలో గురువారం కలెక్టరేట్‌ కార్యాలయంలో కలెక్టర్‌ ఎస్‌.కృష్ణ ఆదిత్యని రోషన్‌ స్వాయ్‌, టి.బుచ్చయ్య మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. ఈనెల 18న ఇంటర్నేషనల్‌ మోనుమెంట్స్‌, సైట్స్‌ వరల్డ్‌ హెరిటేజ్‌ దినోత్సవం సందర్భంగా రామప్ప దేవాలయంలో జరగనున్న ఉత్సవాలపై కలెక్టర్‌తో వారు చర్చించారు.

ఆ వాల్‌ పోస్టర్లు నకిలీవే..

- ప్రకటించిన మావోలు



మావోయిస్టు పార్టీ విడుదల చేసిన లేఖ

ఏటూరునాగారం: ఈనెల 3న మండల కేంద్రంలోని చేపల మార్కెట్‌, జెడ్పీహెచ్‌ఎస్‌ పాఠశాల ప్రహరీకి వేసిన వాల్‌ పోస్టర్లు నకిలీవని, తాము వేయలేదని మావోయిస్టు పార్టీ జయశంకర్‌ మహబూబాబాద్‌, వరంగల్‌ పెద్దపల్లి జిల్లాల డివిజన్‌ కమిటీ కార్యదర్శి వెంకటేశ్‌ గురువారం లేఖలో పేర్కొన్నారు. ఏటూరునాగారం ప్రాంతంలో అధికార పార్టీ, ఇతర పేర్లతో కొన్ని పోస్టర్లు వేశారని, వాళ్లు కొంత మంది ప్రజావ్యతిరేకులు కూడా ఉన్నారని తెలిపారు. అయితే ఆ పోస్టర్లకు తమకు ఎలాంటి సంబంధం లేదని వెల్లడించారు. అవి నకిలీ పోస్టర్లని, కొంత మంది వ్యక్తిగత కారణాలతో వాటిని వేశారని, ఆ పోస్టర్లు వేసి పార్టీని తిరగనివ్వద్దని పోలీసులే వాటిని వేయించారని లేఖలో పేర్కొన్నారు. అందుకోసం వాటిని ఎవరు నమ్మొద్దని మావోయిస్టు వెంకటేశ్‌ తెలిపారు.

అప్పులబాధతో కౌలురైతు ఆత్మహత్య

గీసుకొండ: పంటల సాగుకు చేసిన అప్పులు తీర్చలేక గ్రేటర్‌ వరంగల్‌ నగరం 15వ డివిజన్‌ మొగిలిచర్లకు చెందిన కూనమల్ల భిక్షపతి(48) క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భిక్షపతి అదే గ్రామానికి చెందిన ఇద్దరు రైతులకు చెందిన మూడెకరాల భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. మూడేళ్ల నుంచి సాగు పెట్టుబడులకు రూ.10 లక్షల వరకు అప్పు చేశాడు. పంటలు సరిగ్గా పండక, పెట్టిన పెట్టుబడి రాక మనోవేదనకు గురయ్యాడు. బుధవారం రాత్రి క్రిమిసంహారక మందు తాగి ఆటోలో వచ్చి ఇంటిముందు పడిపోయాడు. విషయాన్ని బంధువులకు చెప్పడంతో వారు వరంగల్‌లోని ప్రైవేట్‌ ఆస్పత్రికి, అనంతరం వరంగల్‌ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు చికిత్స పొందుతూ మృతి చెందాడు. గురువారం మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్‌ సట్ల రాజు తెలిపారు.

సింగిల్‌ పట్టి @ రూ.67 వేలు



వరంగల్‌ మార్కెట్‌కు వచ్చిన మిర్చి బస్తాలు

మార్కెట్‌లో మిర్చి ధరలు ఇలా..

రకం	గరిష్ట	కనిష్ట	మోడల్‌
తేజ	23,300	17,000	21,000
వండర్‌హాట్‌	36,000	31,000	33,000
యూఎస్‌–341	22,500	17,000	20,000
డీడీ	22,500	17,000	20,000
దీపిక	31,000	22,000	27,000
దేశీ	70,000	45,000	65,000
సింగిల్‌పట్టి	67,000	45,000	60,000
1048	23,500	16,500	21,000
తాలు	9,000	5,000	7,000

వరంగల్‌: వరంగల్‌ వ్యవసాయ మార్కెట్‌కు గురువారం రైతులు తీసుకొచ్చిన మిర్చి రకాల్లో సింగిల్‌ పట్టి రకానికి అత్యధికంగా క్వింటాలుకు రూ.67 వేలు ధర పలికింది. ఈ సీజన్‌ ప్రారంభమైన తర్వాత సింగిల్‌ పట్టి రకానికి మొదటిసారి మార్చి 29న గరిష్టంగా క్వింటాలుకు రూ.67వేలు పలికింది. అప్పటి నుంచి రూ.60 నుంచి 65 వేల వరకు ధరలు పలికిన సింగల్‌ పట్టికి గురువారం రోజున మరోసారి గరిష్ట ధరగా క్వింటాలుకు రూ.67వేలు పలికింది. తేజ రకం మిర్చి ధరలు గత వారం ఉన్న విధంగానే ఉండగా.. వండర్‌హాట్‌ రూ.500లు, యూఎస్‌–341 రూ.300లు, దీపిక రూ.1,500లు, సింగిల్‌పట్టి రూ.3వేలు, 1,048 రకానికి రూ.1,500లు క్వింటాలుకు పెరిగినట్లు మిర్చి యార్డు అధికారులు తెలిపారు. మార్కెట్‌కు సుమారు 35 వేల వరకు మిర్చి బస్తాలు యార్డుకు వచ్చినట్లు తెలిపారు.

స్వాతంత్య్ర సమరయోధుడి మృతి



తిరుపతయ్య(ఫైల్‌)

స్టేషన్‌ఘన్‌పూర్‌: కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ.. గురువారం తెల్లవారుజామున మండలంలోని తాటికొండకు చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు అక్కినపెల్లి తిరుపతయ్య (98) మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, వైస్‌ ఎంపీపీ చల్లా సుధీర్‌ రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డితో పాటు వివిధ పార్టీల నాయకులు గ్రామానికి చేరుకుని తిరుపతయ్య మృతదేహంపై పూలమాలలు వేసి ప్రగాఢ సంతాపం తెలిపారు. మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు.

సాయుధ పోరాట యోధుడు

తిరుపతయ్య ఆరోజుల్లో భూస్వాముల ఆగడాలు, నిజాం నిరంకుశ పాలన, కాశీమ్‌ రజ్వీ పోలీసులు పేద ప్రజలపై చేసే ధన, మాన, ప్రాణ దోపిడీ చూసి చలించి పెండ్యాల రాఘవారావు దళంలో మొదట సభ్యుడిగా చేరాడు. అనంతరం దళ నాయకుడిగా కొనసాగారు. రోజంతా దళ సభ్యులతో గుట్టల్లో, పొదల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రత్యర్థులపై దాడి చేసేందుకు ప్రణాళికలు రూపొందించేవాడు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడైన తిరుపతయ్య ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించేవాడు. అనంతరం వరంగల్‌, ఖమ్మం, గుల్బర్గా, జాల్నా జైళ్లలో జైలు జీవితం అనుభవించాడు. దేశానికి స్వాతంత్య్రం సిద్ధించిన తర్వాత సీపీఐ, సీపీఎంలో పని చేశాడు.

పలువురి సంతాపం

తిరుపతయ్య మృతి విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే రాజయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి తదితరులు గ్రామానికి చేరుకుని పార్థివదేహం వద్ద ప్రగాఢ సంతాపం తెలిపారు.

వడదెబ్బతో ఒకరు..



సత్యనారాయణ మృతదేహం

వెంకటాపురం(కె): వడదెబ్బ తగిలి ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండల పరిధి అంకన్నగూడేనికి చెందిన గట్టు సత్యనారాయణ (55) మృతి చెందాడు. సత్యనారాయణ గురువారం మిర్చి తోటలో కూలీలతో పని చేయిస్తున్నాడు. మధ్యాహ్నం భోజనం చేసి ఇంటికి తిరిగి వచ్చేందుకు సిద్ధమవుతున్న సమయంలో ఎండ తీవ్రతకు ఒక్కసారిగా కళ్లు తిరిగి పడిపోయాడు. గమనించిన కూలీలు సత్యనారాయణను ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడు.

‘సీసీ’లో చిక్కకుండా చోరీ!

- బయ్యారం పీహెచ్‌సీలో రూ.65 వేల వస్తువుల అపహరణ



చోరీకి గురైన వస్తువుల వివరాలు తెలుసుకుంటున్న ఎస్‌ఐ రమాదేవి

బయ్యారం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సినీ ఫక్కీలో చోరీకి పాల్పడ్డారు. 24 గంటల పాటు రోగులకు ప్రాథమిక వైద్యం అందించే పీహెచ్‌సీలో బుధవారం రాత్రి ఇద్దరు ఉద్యోగులు విధుల్లో ఉన్నారు. అర్ధరాత్రి తర్వాత వాళ్లు లోపల గడియ పెట్టుకొని నిద్రపోయారు. ఈసమయంలో పీహెచ్‌సీలోకి ప్రవేశించిన గుర్తు తెలియని వ్యక్తులు పీహెచ్‌సీ ఆవరణలోని సీసీ కెమెరాకు చిక్కకుండా లోపలికి చొరబడ్డారు. సిబ్బంది నిద్రిస్తున్న గది తలుపులకు బయటి నుంచి గడిపెట్టి పీహెచ్‌సీలో ఉన్న 15 వేల విలువైన నాలుగు బ్యాటరీలు, సెటాప్‌బాక్స్‌, రెండు డోర్‌కర్టెన్స్‌, ఒక కంప్యూటర్‌ కీబోర్డును ఎత్తుకెళ్లారు. తెల్లవారుజామున నిద్రలేచిన ఉద్యోగులు లోపలి నుంచి బయటకు వచ్చేందుకు ప్రయత్నించగా.. గడియ పెట్టినట్టు గుర్తించి స్థానికులను పిలిచి బయటకు వచ్చారు. ఘటనాస్థలాన్ని సీఐ బాలాజీ, ఎస్‌ఐ రమాదేవి పరిశీలించారు. కాగా.. పీహెచ్‌సీలో చోరీకి గురైన వస్తువుల విలువ రూ.65 వేలు ఉంటుందని పీహెచ్‌సీ వైద్యులు సాగర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భార్య గొంతు నులిమి చంపిన భర్త అరెస్ట్‌



హత్య వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

మల్హర్‌: జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా మల్హర్‌ మండలం రుద్రారం గ్రామంలో మూడెత్తుల లక్ష్మిని గొంతు నులిమి హత్య చేసిన కేసుల్లో భర్త మూడెత్తుల రమేశ్‌ను గురువారం అరెస్ట్‌ చేసినట్లు కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. కాటారం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రామ్మోహన్‌ మాట్లాడుతూ.. లక్ష్మి వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందనే అనుమానంతోనే ఈనెల 5న ఉదయం 4గంటల సమయంలో గొంతు నులిమి చంపినట్లు తెలిపారు. రమేశ్‌ గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో కొయ్యూరు పోలీస్‌ స్టేషన్‌లో లొంగిపోయినట్లు ఆయన వెల్లడించారు. నేరం ఒప్పుకోవడంతో స్టేట్‌మెంట్‌ రికార్డు చేసి జ్యూడీషియల్‌ రిమాండ్‌ నిమిత్తం భూపాలపల్లి మేజిస్ట్రేట్‌ ఎదుట హాజరుపర్చినట్లు వెల్లడించారు. ఆయన వెంట కాటారం సీఐ రంజిత్‌రావు, మహా ముత్తారం ఎస్సై సుధాకర్‌, కానిస్టేబుల్స్‌ హరికుమార్‌, రమేశ్‌నాయక్‌ ఉన్నారు.

భారతీయత మనల్ని కలుపుతుంది

- సినీ హీరో పవన్‌ కల్యాణ్‌
- నేటి నుంచి నిట్‌లో స్ప్రింగ్‌స్ప్రీ–23 వేడుకలు



నిట్‌ క్యాంపస్‌లో మాట్లాడుతున్న సినీ హీరో పవన్‌ కల్యాణ్‌

కాజీపేట అర్బన్‌ : ‘కళలకు పుట్టినిల్లు అయిన ఓరుగల్లుకు కోటి దండాలు. హలో నిట్‌ వరంగల్‌. మీదే ఈ తరం’ అంటూ ప్రముఖ సినీహీరో పవన్‌ కల్యాణ్‌ యువతలో జోష్‌ నింపారు. నిట్‌ వరంగల్‌లో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు జరగనున్న వసంతోత్సవ వేడుకలు స్ప్రింగ్‌స్ప్రీ–23 ప్రారంభోత్సవానికి గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి స్ప్రింగ్‌స్ప్రీ–23 కల్చరల్‌ ఫెస్ట్‌ను లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. ఏకశిలా నగరానికి, రాణి రుద్రమదేవి పాలించిన, పుట్టుక నీది చావు నీది బతుకంతా దేశానిది అన్న కాళోజీ, భాగవతం రచించిన బమ్మెర పోతన నడియాడిన ఓరుగల్లుకు రావడం ఆనందంగా ఉందన్నారు. భారతదేశంలో వివిధ ప్రాంతాల్లోని సంస్కృతీసంప్రదాయాలు భారతీయతలోని ఏకత్వం మనల్ని కలుపుతుందని, ఇందుకు నిదర్శనమే నాటు నాటు పాట ఆస్కార్‌ సాధించడమని పేర్కొన్నారు. నిట్‌ వరంగల్‌లో నిర్వహిస్తున్న కల్చరల్‌ ఫెస్ట్‌ మనల్ని కలిపిందన్నారు. ‘నిట్‌ వరంగల్‌లో నిర్వహిస్తున్న కల్చరల్‌ ఫెస్ట్‌ స్ప్రింగ్‌స్ప్రీ–23 వేడుకలకు అతిథిగా పిలవగా.. నేను రెగ్యులర్‌ కళాశాలకు వెళ్లిన విద్యార్థిని కాదు, బాగా చదువుకోలేదు. కానీ నిత్యపఠనం చేసే విద్యార్థిని, నేను మీ కళాశాలకు రావడానికి అర్హుడినా?’ అని అడిగానన్నారు. ‘జీవితంలో షార్ట్‌కట్స్‌ వెతుకోవద్దు అపజయాలను ధైర్యంగా ఎదుర్కొని విజయం సాధించాలి’ అని అన్నారు. కార్యక్రమంలో నిట్‌డైరెక్టర్‌ ఎన్‌వీ రమణారావు, డీన్‌ స్టూడెంట్‌ వెల్ఫేర్‌ పులి రవికుమార్‌, ఫ్యాకల్టీ అడ్వైజర్‌ హీరాలాల్‌, స్టూడెంట్‌ కోఆర్డినేటర్స్‌ తదితరులు పాల్గొన్నారు.